

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న డా. కె. లక్ష్మణ్, భరత్‌గౌడ్, కుశాల్‌గౌడ్

యువత స్వచ్ఛందంగా రక్తదానం చేయాలి

● ఎంపీ డా. కె. లక్ష్మణ్

చిక్కడపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్నవారికి సకాలంలో రక్తం అందక అనేకమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఎంపీ డా.కె.లక్ష్మణ్ అన్నారు. యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి ప్రమాదంలో ఉన్నవారికి రక్తదానం చేయాలని లక్ష్మణ్ సూచించారు. ఆదివారం గాంధీనగర్‌లో జనసేన పార్టీ ముషీరాబాద్ సీనియర్ నాయకుడు కార్తీక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డా. కె. లక్ష్మణ్ రక్తదాన శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. పేద ప్రజలు ప్రమాదంలో ఉన్నప్పుడు రక్తం కొనలేక సకాలంలో చికిత్స అందక ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. తలసేమియా వ్యాధిగ్రస్థులకు దాతలు అందజేసిన రక్తం వరంలాంటిదని అన్నారు. జనసేన అధినేత, ప్రముఖ హీరో పవన్ కల్యాణ్‌ను యువత స్ఫూర్తిగా తీసుకుని సేవా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు గుండగోని భరత్‌గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుశాల్‌గౌడ్, కె. రాహుల్ నాయకులు సురేష్, రవి, విజయ్, శివ తదితరులు పాల్గొన్నారు.



ముషీరాబాద్‌లో మహిళలు ఏర్పాటు చేసిన ఫుడ్‌కోర్టును ప్రారంభించిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్ రావు

మహిళలు స్వయం ఉపాధితో ఎదగాలి

● ఎమ్మెన్ శ్రీనివాస్ రావు

ముషీరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలపడాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు అన్నారు. ముషీరాబాద్‌లో మహిళలు ఐక్యంగా లోటస్ బ్లూమ్ పేరుతో అనీసా, రమా, జ్యోతిక తదితరులు కలిసి ఫుడ్ కోర్టును ఏర్పాటు చేశారు. ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు ముఖ్య అతిథిగా హాజరై ఫుడ్ కోర్టును ప్రారంభించి మహిళలను అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వంటింటికే పరిమితం కాకుండా స్వశక్తితో ఎదుగుతూ ఇతరులకు సైతం ఉపాధి కల్పించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కల్యాణ్, లింగంగుప్తా, శ్రీనివాస్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



లోయర్ ట్యాంక్‌బండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ఉద్యమ కారులు

మిలియన్ మార్చ్ స్ఫూర్తితో ప్రతిజ్ఞ దివస్

కవాడిగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఉద్యమ కారుల ఆత్మగౌరవం ప్రత్యేక రాష్ట్రం కోసం నాడు 2011 మార్చి 10వ తేదిన నిర్వహించిన మిలియన్ మార్చ్ స్ఫూర్తితోనే నేడు ప్రతిజ్ఞ దివస్ నిర్వహించినట్లు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పటోళ్ల సురేందర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో 33 జిల్లాల నుంచి ఉద్యమ కారులు హాజరై ప్రతిజ్ఞ దివస్‌లో ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమ కారులకు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుపై అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం చర్చించి స్పష్టమైన ప్రకటన చేయాలని సీఎం రేవంత్ రెడ్డి వారు కోరారు. కార్యక్రమంలో ఉద్యమ కారుల ఫోరం నాయకులు వీరస్వామి, కొండస్వామి, ఐలయ్యయాదవ్, జ్యోతిరెడ్డి, తాడూరి గగన్‌కుమార్, జానకి రెడ్డి, మల్లారి అనిల్, రాజేశ్వర్, గ్రేటర్ నాయకులు దయానంద్, ఇంద్రకుమార్, బూపాల్, జగన్‌యాదవ్, పోచయ్య, ప్రభాకర్, ఉద్యమ కారులు పాల్గొన్నారు.


మిలియన్ మార్చ్ స్ఫూర్తిని కొనసాగిద్దాం

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రజల ప్రజాస్వామిక హక్కుగా మలిదశ ఉద్యమం విజయతీరాలకు చేర్చడంలో మిలియన్ మార్చ్ ప్రధాన ఘట్టమని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో మిలియన్ మార్చ్ కార్యక్రమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఉందన్నారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాడు సీమాంధ్ర దోపిడీదారుల గుండెల్లో రైళ్లు పరిగెత్తించడంతో పాటు ఆ నాటి కేంద్ర ప్రభుత్వాన్ని మెడలు వంచిందన్నారు. ఎక్కడ దోపిడీ, పీడన, వివక్షత, అణచివేత, అన్యాయం ఉంటుందో అక్కడ తప్పనిసరి ప్రజా తిరుగుబాటు ఉంటుందని నిరూపించిన మిలియన్ మార్చ్ పాలకులకు నిరంతరం హెచ్చరిక వంటిదన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన నాలుగు కోట్ల ప్రజానీకానికి అనునిత్యం స్ఫూర్తిని నింపిన మిలియన్ మార్చ్ ప్రజానీకానికి చిరస్మరణీయమని పేర్కొన్నారు.

రైళ్లలో ఇద్దరు మహిళల మంగళ సూత్రాలు చోరీ

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సిగ్నల్ కోసం ఆగిన రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ఇద్దరు మహిళల మంగళ సూత్రాలను దొంగలు లాక్కోని పారిపోయారు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం... కొండాపూర్‌లో నివాసం ఉంటున్న హారిక బెంగళూరులో మైసూరు ఎక్స్‌ప్రెస్ రైలు ఎక్కి కాచిగూడకు వస్తున్నారు. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో గద్వాల్ రైల్వే స్టేషన్ సమీపంలోని మానుపాడువద్ద రైలు సిగ్నల్ కోసం ఆగింది. ఇదే అదనుగా భావించిన దొంగ హారిక మెడలోని నాలుగు తులాల బంగారు మంగళ సూత్రాన్ని లాక్కోని పారిపోయాడు. మరో సంఘటనలో శ్రీకాకుళంకు చెందిన హేమలత తిరుపతి నుంచి కాచిగూడకు రావడానికి వెంకటాద్రీట రైలు ఎక్కింది. ఆదివారం తెల్లవారు జామున 2 గంటల సమయంలో గద్వాల్ రైల్వేస్టేషన్ సమీపంలోని మానుపాడువద్ద రైలు సిగ్నల్ కోసం ఆగింది. ఇదే అదనుగా భావించిన దొంగ హేమలత మెడలోని రెండు తులాల బంగారు మంగళ సూత్రాన్ని రైలు బోగి కిటికిలోనుంచి లాక్కోని పారిపోయాడు. ఈ రెండు సంఘటనలపై బాధిత మహిళలు కాచిగూడ రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని తదుపరి విచారణ నిమిత్తం మహబూబ్‌నగర్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం స్వాధీనం



కవాడిగూడ, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని 55 సంవత్సరాల వయస్సుగల వ్యక్తి మృతదేహాన్ని దోమలగూడ పోలీసులు ఆదివారం ఉదయం స్వాధీనం చేసుకున్నారు. దోమలగూడ ఎస్ఐ నిరంజన్ తెలిపిన వివరాల ప్రకారం... 55 సంవత్సరాల గుర్తు తెలియని వ్యక్తి ట్యాంక్‌బండ్‌పై ఉన్న విద్యుత్ పోల్ నంబర్ 73-75 మధ్య చనిపోయి ఉన్నాడని దోమలగూడ పోలీసులకు సమాచారం వచ్చింది. వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మృతుడు నాలుగు ఐదు రోజులుగా ట్యాంక్‌బండ్‌పైనే సంచరిస్తున్నాడని తెలిపారు. శనివారం రాత్రి పడుకొని నిద్రలోనే చనిపోయినట్లు పోలీసులు తెలిపారు. అతని ఆచూకీ తెలిసిన వారు దోమలగూడ పోలీసులకు గాని లేదా ఫోన్ నంబర్ 9441309339లో సమాచారం అందించాలని కోరారు.

జోరుగా హలీం అమ్మకాలు





దాయారం మార్కెట్ వద్ద జోరుగా హలీం అమ్మకాలు

● చికెన్ ధరలు తగ్గడంతో తక్కువ ధరకే హలీం

ముషీరాబాద్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో హలీం అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నారు. సాయంత్రం 5 నుంచి నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు ప్రధాన కుడళ్లు, హోటల్స్ ముందు ఏర్పాటు చేసిన హలీం కేంద్రాలు హలీం ప్రియులతో కిటకిటలాడుతున్నాయి. బర్డ్‌ఫ్లూ భయం వల్ల చికెన్ హలీం కేవలం రూ.60 నుంచి రూ.80 కే అమ్మతున్నారు. వివిధ రకాల చికెన్ ఐటమ్స్ సైతం తక్కువ ధరకే విక్రయిస్తున్నప్పటికీ ప్రజలు అంతంతమాత్రమే కొనుగోలు చేస్తున్నారు. మటన్ హలీం రూ.200 నుంచి రూ.350 ప్లేట్ అమ్మినప్పటికీ ప్రజలు పెద్ద ఎత్తున కోనుగోలు చేస్తున్నారు. చికెన్ హలీం ధర తక్కువగా ఉన్నప్పటికీ ప్రతి రోజు 100 ప్లేట్ల లోపే విక్రయిస్తున్నారు. మటన్ హలీం మాత్రం ధర ఎక్కువ ఉన్నప్పటికీ రోజుకు 150 ప్లేట్ల నుంచి 250 ప్లేట్ల వరకు అమ్ముడు పోతున్నాయని వ్యాపారులు పేర్కొంటున్నారు.

తక్కువ ధరకే చికెన్ ఐటమ్స్



చికెన్ అమ్మకాలు తగ్గడంతో తక్కువ ధరకే చికెన్ వెరైటీ ఐటమ్స్‌ను విక్రయిస్తున్నాం. హలీం కూడా 60 రూపాయలకే ప్లేట్ అమ్ముతున్నాం. అమ్మకాలు ఇప్పుడిప్పుడే ఊపు అందుకుంటున్నాయి.

- సలీం, హలీం వ్యాపారి

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

● జస్టిస్ రాధారాణి



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ రాధారాణి

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని జస్టిస్ రాధారాణి అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ కుటుంబం నుంచే లింగ వివక్షత ఉందని, చట్టాలు ఎన్ని ఉన్నా మహిళలపై అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయని, మహిళ సాధికారిత మాటలకే పరిమితమైందన్నారు. పిల్లలపై జరుగుతున్న అకృత్యాలపై ప్రత్యేకంగా పోక్సో చట్టం ఉందని ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి ఇంట్లో ప్రతి అంశంపై నిర్ణయాధికారం తీసుకునే హక్కు భార్యకు కూడా ఉంటుందని తెలుసుకోవాలన్నారు. మహిళలు భయపడాల్సిన అవసరం లేదని ఎన్నో చట్టాలు ఉన్నాయని అన్నారు. మద్రాస్ హైకోర్టు న్యాయవాది ఐలు, జాతీయ కౌన్సిల్ ఉపాధ్యక్షురాలు చంకిరాజు మాట్లాడుతూ రాజ్యాంగం మహిళలకు కల్పించిన హక్కులు స్వాతంత్ర్యం వచ్చి 76 ఏళ్లు పూర్తయిన అమలు కాకపోవడం బాధకరమన్నారు. కార్యక్రమంలో ఐలు సంస్థ కన్వీనర్ సీ.హెచ్.శైలజ, కో-కన్వీనర్ వనజ, ప్రధాన కార్యదర్శి పార్థసారధి, మంజుల, అన్నపూర్ణ, లక్ష్మీకుమారి, రాంచంద్రరెడ్డి, ప్రవీణ్, శర్మ, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ అప్పలయ్య

మహిళలపై జరుగుతున్న అన్యాయాలు అరికట్టాలి

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలపై జరుగుతున్న అన్యాయాలు, అకృత్యాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల డైరెక్టర్ డాక్టర్ విష్ణు ప్రియ, డాక్టర్ అప్పలయ్య, లా కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ సృజనలు పేర్కొన్నారు. బాగ్‌లింగంపల్లిలో ఆదివారం డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ విద్యా సంస్థల ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఆర్థిక రంగాలలో మహిళలు రాణించాలని సూచించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పొందేందుకు కలిసికట్టుగా ముందుకు సాగాలన్నారు. మహిళా చట్టాలను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

● మహిళల సమస్యలపై ఉద్యమించాలి

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళల మౌలిక సమస్యల పరిష్కారం కోసం సంఘటితంగా ఉద్యమించాలని కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ తోట జ్యోతిరాణి, రచయిత్రి శీల సుభద్రాదేవిలు సూచించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని జనసాహితీ, స్త్రీ విముక్తి సంఘటనల సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళా చట్టాలను పాలకులు కఠినంగా అమలు చేయాలన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎం.లక్ష్మి, కరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



గాయని రేవతిని సన్మానిస్తున్న రాజు, చంద్రశేఖర్ తదితరులు

ఆకట్టుకున్న సంగీత విభావరి

చిక్కడపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): రాగా ఆర్ట్స్ కల్చరల్స్ శ్రీరామ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో నిర్వహించిన సంగీత విభావరి ప్రేక్షకుల ఆదరణ చూరగొంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వాహకులు కె.ఇ రాజు, గొర్తి చంద్రశేఖర్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమాన్ని తొలుత గాయనీమణులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. రేవతి, రాజు, శ్రీదేవి, రాజేశ్వరి, బాబురావు, అనురాధ, శ్రీనివాస్, గోపీకృష్ణ, నయన, మోహన్, పరమేష్, తులసీదాస్ తదితరులు తెలుగు, హిందీ గీతాలు ఆలపించి శ్రోతలను రంజింపచేశారు.

మహిళలు బాగుంటేనే సమాజం ముందుకు

చిక్కడపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు బాగుంటేనే సమాజం ముందుకు పోతుందని విద్యావేత్త, కళాభిమాని లావణ్య అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సిటీ కల్చరల్ సెంటర్‌లో జంటనగరాలకు చెందిన ప్రముఖ గాయనీమణులను సత్కరించారు. ఈ సందర్భంగా విద్యావేత్త లావణ్య మాట్లాడుతూ మహిళల కృషి అనితరసాధ్యం అన్నారు. ప్రముఖ పాత్రికేయుడు పురుషోత్తం నారగొని మాట్లాడుతూ ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు అన్నారు. పలువురు ప్రముఖులు, సాహిత్య, సంగీత, కళారంగాలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

మధువనంలో మానవత్వం పరిమళించే కవితలు



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య కాశిం

చిక్కడపల్లి, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): సున్నితత్వం, మానవత్వం పరిమళించే కవితలు మధువనం కవితాసంపుటిలో ఉన్నాయని ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొ.కాశిం అన్నారు. మృదుల రచించిన మధువనం కవితాసంపుటి ఆవిష్కరణ సభ త్యాగరాయగానసభలో ఆదివారం రాత్రి జరిగింది. ముఖ్యఅతిథిగా ఆచార్య కాశిం పాల్గొని సంపుటిని ఆవిష్కరించి మాట్లాడారు. కవిత్వం రాసే ప్రతి కవి కవిత్వం గురించి అమ్మ నాన్న గురించి తప్పక రాస్తారని అలాగే మృదుల గొప్పగా భావ వ్యక్తీకరణ చేశారని ప్రశంసించారు. ప్రేమ ప్రకృతి వ్యాఖ్యానించడం కవిత్వం అని మృదుల కవిత్వం అంతా అదేనని అన్నారు. స్త్రీలు పరిశీలన శక్తి ఎక్కువ అని మృదులలో అట్టి ప్రతిభ ఉందని అభినందించారు. అయితే నేడు అసమ్మతి ప్రకటిస్తేనే నేరంగా భావించే సందర్భంలో మృదుల వాస్తవ పరిస్థితి పరిశీలన చేసి రాబోయే రోజుల్లో సామాజిక దృక్పథంతో రాయాలని కోరారు. అధ్యక్షత వహించిన ఆచార్య మహ్మద్ సలీం మాట్లాడుతూ ఉన్నత విద్యావంతురాలిగా మృదుల తన శిష్య బృందానికి ఆదర్శంగా నిలుస్తారని అన్నారు. సంపుటిని సమీక్ష చేసిన సిటీ కాలేజీ తెలుగు శాఖ అధ్యక్షుడు డా. కోయి కోటేశ్వరరావు మాట్లాడుతూ నల్గొండ మట్టిలోనే కవిత్వం ఉందని అన్నారు. మృదుల నల్గొండ నేలలో పుట్టినందున ఆత్మగౌరవ ప్రతీకలుగా కవితలు ఉన్నాయని అభివర్ణించారు. రాజ్యాంగ నైతిక అవగాహన ఉన్నందున సర్వమత సమాన భావన ఆమె కవితలో ఉందన్నారు. కీలకోపన్యాసం చేసిన డా.కె. కృష్ణమూర్తి మాట్లాడుతూ సమాజ హితం సాహిత్య లక్ష్యం అయినా నియమిత నిబంధనలు ఉండవన్నారు. కవి ఆలోచనలు అక్షరరూపం దాల్చినప్పుడు అత్యుత్తమ సంస్కారం వ్యక్తీకరణ కావాలని అన్నారు. మృదుల కవిత్వం అదే దిశగా సాగిందన్నారు. సంఘాన్ని ప్రశ్నించే తత్వం, లోతైన అధ్యయనం వాస్తవిక దృష్టితో మృదుల కవిత్వ రచన చేశారని వివరించారు. డా.త్రిపురం భాస్కర్‌రెడ్డి, డా. జయప్రకాష్, ఆసిరెడ్డి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అడిక్‌మెట్ బొడ్రాయి వార్షికోత్సవం



బొడ్రాయి ఉత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠా గోపాల్, తదితరులు

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అడిక్‌మెట్‌లోని బొడ్రాయి 9వ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం అడిక్‌మెట్‌లోని వీరాంజనేయ స్వామి ఆలయం ఎదురుగా ఘనంగా జరిగాయి. బొడ్రాయి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం ప్రత్యేక పూజలు జరిగాయి. స్థానిక ప్రజలు పెద్దఎత్తున పాల్గొని బోనాలు సమర్పించారు. అడిక్‌మెట్ బొడ్రాయి ఉత్సవ కమిటీ ఫలహారం బండి ఊరేగింపు జరిగింది. ఈ వేడుకల్లో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు తిరుమల్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథులుగా రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, తెలంగాణ రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ జె.జైపాల్, మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, వడ్డెర ఆత్మగౌరవ భవన కమిటీ చైర్మన్ జె.సత్యనారాయణ, వడ్డెర సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎ.అంతయ్య, సలహాదారు కృష్ణయ్య, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎమ్మెన్ శ్రీనివాస్‌రావు, యువజన నాయకుడు ముఠా జైసింహలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అడిక్‌మెట్ అభివృద్ధికి తమవంతు సహకారం అందిస్తామన్నారు. అడిక్‌మెట్ ప్రాంత ప్రజలు సుఖసంతోషాలతో ఉండడానికి బొడ్రాయి ఉత్సవాలు ప్రతియేడు జరుపుకోవాలని సూచించారు. ఈ ఉత్సవాల్లో అడిక్‌మెట్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు పాశం సాయికృష్ణ యాదవ్, బీఆర్ఎస్ అధ్యక్షుడు బల్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు దర్గా నర్సింగ్‌రావు, కిషోర్, బీఆర్ఎస్ నాయకులు చిట్టి మాధవ్, రాజు, బస్తీవాసులు ఎమ్మార్పీఎస్ నాయకులు కృష్ణ, రాజశేఖర్, అడిక్‌మెట్ వడ్డెర సంఘం అధ్యక్షుడు కుంచపు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



నిషాన్ యాత్రలు నిర్వహిస్తున్న యువతులు

శ్యామ్‌బాబా ఆలయంలో నిషాన్‌యాత్రలు

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): కాచిగూడ వీరన్నగుట్టలోని శ్యామ్ బాబా మందిర్‌లో ఫాల్గుణి మేళా వేడుకల సందర్భంగా నగరవ్యాప్తంగా ఆదివారం నిషాన్‌యాత్రలు నిర్వహించారు. సోమవారం శ్యామ్‌బాబా ఆలయంలో ఫాల్గుణి మేళా వేడుకలు నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా నగరంలోని గౌలిగూడ, అఫ్జల్‌గంజ్, నాంపల్లి, పాతబస్తీ, బేగంబజార్, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల నుంచి రంగురంగుల జెండాలను పట్టుకుని యువతీ, యువకులు ర్యాలీగా శ్యామ్‌బాబా మందిరానికి చేరుకున్నారు. శ్రీకృష్ణ భగవానుడి విగ్రహాలను రథాలపై పెట్టుకుని రంగురంగుల పూలు చల్లుకుంటూ ర్యాలీగా తరలివచ్చారు. జెండాలను శ్యామ్‌బాబా మందిరంలో ఉంచి స్వామి వారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో శ్యామ్‌బాబా సేవా మందిర్ సమితి ప్రతినిధులు ఇంద్రకిరణ్ ఆగర్వాల్, రాందేవ్ ఆగర్వాల్, రాజువిగ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో ఓం తైక్వాండో అకాడమిలో కరాటే పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెమోంటోలను ప్రదానం చేస్తున్న కార్పొరేటర్ యాకర అమృత

ఆత్మరక్షణకు కరాటే ఎంతో దోహదపడుతుంది

● కార్పొరేటర్ యాకర అమృత

నల్లకుంట, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): ఆత్మరక్షణతో పాటు శారీరక ఫిట్‌నెస్‌కు కరాటే ఎంతో దోహదపడుతుందని, విద్యార్థినులు, యువతులు కరాటే శిక్షణ తీసుకోవడంపై వారి తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృత అన్నారు. ఆదివారం డివిజన్‌లోని పద్మాకాలనీలో ప్రోగ్రెసివ్ యంగ్‌మెన్స్ అసోసియేషన్, పద్మానగర్ మహిళా అభ్యుదయ మండలి, పద్మా కో-ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో తైక్వాండో అకాడమిలో నిర్వహించిన కరాటే పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు, మెమోంటోలను ఆమె ప్రదానం చేశారు. కరాటే నేడు బాలికల ఆత్మరక్షణకు ఎంతో అవసరం అని అన్నారు. కార్యక్రమంలో అకాడమి ఫౌండర్ ప్రసన్న అంజనేయులు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, కరాటే సీనియర్ కోచ్ శ్రీకాంత్, సాయికృష్ణ, హాసిని, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



పారిశుధ్య కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న కావ్యకిషన్‌రెడ్డి

మహిళా సాధికారతకు మోదీ ప్రభుత్వం కృషి

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి

బర్కత్‌పుర, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారితకు మోదీ ప్రభుత్వం కృషి చేస్తుందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి సతీమణి కావ్యకిషన్‌రెడ్డి అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ఆదివారం కాచిగూడ నింబోలిఅడ్డలోని డివిజన్ అభివృద్ధి కార్యాలయం వద్ద అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కార్పొరేటర్ కన్నె ఉమాదేవి ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ పారిశుధ్య కార్మికులు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, నర్సులకు చీరలను పంపిణీ చేసి స్వీట్లు తినిపించి శాలువతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు మహోన్నతమైనవని, మాతృదేవోభవ అంటూ మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. ప్రధాని మోదీ కలలుకంటు వికసిత్ భారత్ నిర్మాణంలో మహిళలు ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మంత్రి సి.కృష్ణాయాదవ్, బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, నల్లకుంట కార్పొరేటర్ వై.అమృత, ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు బల్వీర్, శ్యామ్‌రాజ్, కృష్ణగౌడ్, అజయ్‌కుమార్, మధుయాదవ్, యశ్వంత్, క్షీరసాగర్, సుభాష్‌పటేల్, నందకిషోర్‌యాదవ్, భీమ్‌రాజ్, రవియాదవ్, లావణ్య, జ్యోతి, శాంతాబాయి, వరలక్ష్మి పాల్గొన్నారు.

చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలను రద్దు చేయాలి

● జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దేవదాసు



మాట్లాడుతున్న దేవదాసు

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): చేనేత సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌చార్జిలను రద్దు చేయాలని చేనేత వర్గాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షుడు డాక్టర్ చిక్కా దేవదాసు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయంలో పర్సన్ ఇన్‌చార్జీల అధికారుల పాలనలో చేనేత సహకార సంఘాల్లో అవినీతి, అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారుల పాలనలో చేనేత కార్మికులకు చేతినిండా పని కల్పించకపోవడమే కాకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తుందని ఆశపడిన చేనేత వర్గాలకు నిరాశ మిగిలిందన్నారు. గత ప్రభుత్వ బాటలోనే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని ఆయన ఆరోపించారు. పర్సన్ ఇన్‌చార్జిలను రద్దు చేసి చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని, లేనిపక్షంలో రాష్ట్రస్థాయిలో ఆందోళనలు చేపడతామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు.



సమావేశంలో కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి నినాదం చేస్తున్న నాయకులు

రాయల సుభాష్ చంద్రబోస్ జీవితం విప్లవ కారులకు స్ఫూర్తి

రాంనగర్, మార్చి 9 (ఆంధ్రజ్యోతి): అయిదు దశాబ్దాలుగా రహస్య జీవితం గడిపి, మొత్తం తన జీవితాన్ని విప్లవోద్యమ నిర్మాణానికి అంకితం చేసిన కామ్రేడ్ రాయల సుభాష్ చంద్రబోస్ జీవితం విప్లవ శ్రేణులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.గోవర్ధన్ కొనియాడారు. ఆదివారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో రాయల సుభాష్ చంద్రబోస్ 9వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కె.గోవర్ధన్ మాట్లాడుతూ నక్సల్బరి విప్లవ పోలికేకతో ఖమ్మంలో డిగ్రీ చదువుకున్న బోస్ ఆకర్షితులైన ఖమ్మం ఏజెన్సీ ప్రాంతంలో విప్లవోద్యమ నిర్మాణానికి బయలుదేరారని అన్నారు. 1972లో కామ్రేడ్ చంద్రపుల్లారెడ్డితో కలిసి ఆడవుల్లోని ఆదివాసి, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం రహస్య జీవితం గడిపారని కొనియాడారు.